ఆదివారం అక్టోబరు 31

## దేనిని కలపకూడదు లేక దేనిని తీసివేయకూడదు

**ద్వితి 4:1,2 చదువుడి. దేవుడు తన విధులను తన కట్టడలను అనుసరించే విషయములో ఆయన వారికిచ్చిన ప్రత్యేకమైన హెచ్చరిక ఏమిటి? (ద్వితి 12:32 కూడా చూడుడి).**

దేవుడు తన ప్రజలకిచ్చిన విధులకు మరియు కట్టడలకు విధేయత చూపించమనియు, వాటికి దేనిని కలపకూడదు, దేనిని తీసివేయకూడదని చెప్పెను. ఆవిధముగా ఎందుకు చెప్పియున్నాడు? ఎవరైనను దేవుని యొక్క ఆజ్ఞలను మార్చివేయాలని ఎందుకనుకుంటారు?

ఈ ప్రశ్నలకు జవాబు ఏమిటో మనకు తెలుసు.

"దేవుని యొక్క ధర్మశాస్త్రమును మార్చివేయాలని సాతానుడు పరలోకములో తల పెట్టిన పోరాటము విరామము లేకుండా కొనసాగిస్తూనే ఉన్నాడు. అతడు పతనమై పోకముందు, దేవుని చట్టములు తప్పులతో కూడుకొనినవి వాటిని సవరించవలసిన అవసరమున్నదని పరలోకములో తన వాదన ద్వారా లోకాన్ని ఒప్పించాలని చేసిన ప్రయత్నములో విజయము సాధించాడు. దేవుని నామమును స్వీకరించి బాహాటంగా ప్రకటించే క్రైస్తవ సంఘములో అధిక భాగము వారి మాటల ద్వారా దేవుని చట్టము యెడల వారికున్న వైఖరిని బట్టి సాతాను చేసిన పొరపాటునే వారు కూడా అనుసరిస్తున్నారు" ఎలెన్ జి వైట్, ఎన్నిక చేయబడిన వర్తమానములు, పుస్తకము 2, పుట 107.

పురాతన ఇశ్రాయేలు యొక్క చరిత్రను గూర్చి మీరు ఆలోచన చేసినప్పుడు వారు అనేక విషయాలలో సమస్యలో చిక్కుకొనుటయే గాక, దేవుని ధర్మశాస్త్రములోని కొన్ని ఉపదేశములు వారికి అనుకూలముగా ఉండులాగున తొలగించి, ధర్మశాస్త్రమును గైకొనే విషయములో కొన్ని భాగాలను అలక్ష్యము చేయుచు, కొన్ని క్రొత్త విషయాలను కలిపి చివరికి ఆజ్ఞలను మీరే పరిస్థితికి అలవాటు పడిరి.

**మత్తయి 15:1-9 చదువుడి. ఉదాహరణకు వేరే సందర్భములో మోషే ఏవిధముగా ఇశ్రాయేలు జనాంగమును హెచ్చరించియున్నాడు?**

ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేయబడిన దేశములో ప్రవేశించిన తరువాత ఉదాహరణకు, తరచుగా విగ్రహారాధన విషయములో వారికివ్వబడిన హెచ్చరికలను నిర్లక్ష్యము చేసేవారు. దానికి ప్రతిఫలముగా అనేకమైన అన్యదేవతారాధనలు చేసేవారు. వారు కేవలం యావెహ్ (దేవునిని) మాత్రమే ఆరాధించవలసియుండగా అనేక అన్యమతాచారములను మరియు మానవ సంప్రదాయములను దేవుని చట్టమునకు కలిపి, దాని ప్రభావము ఏమియు లేకుండా జేసి యేసు వచ్చే సమయానికి ఆయనే వారిని ఖండించే స్థితికి దిగజారిపోయి వున్నారు.

ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రమునకు కొంత కలిపి, లేక కొంత తీసివేసి చివరికి దానిని మార్చి వేసారు. ఫలితముగా ఇశ్రాయేలు దేశము ఎన్నో విధాలుగా శ్రమలకు గురైనది.

**ధర్మశాస్త్రమునకు కొంత కలిపి లేక కొంత తీసివేసే విధముగా మనము ఉండకూడదనియు, దేవుడు చెప్పిన దానినే మనము చేయుటకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకొనవలసియున్నాము?**

**సోమవారం** **నవంబరు 1**

## బయల్పెయోరు

ద్వితి 4:3, 4లో ఇశ్రాయేలు జనాంగమునకు వారి గత చరిత్రను జ్ఞాపకము చేసే విధముగా కొన్ని విషయాలను వారికి బోధిస్తూ, ఆ అనుభవము నుండి వారు ఎటువంటి ఆధ్యాత్మిక మరియు ఆచరణీయమైన సత్యములను నేర్చుకోవాలో వివరించడం జరిగింది.

**సంఖ్యా 25:1–15 చదువుడి. ఇక్కడ ఏమి సంభవించినది మరియు ఆ వైఫల్యము నుండి ఇశ్రాయేలు ప్రజలు ఎటువంటి ఆధ్యాత్మిక మరియు ఆచరణయోగ్యమైన సత్యములను నేర్చుకొనవలసియున్నారు?**

ఇశ్రాయేలీయులు విగ్రహారాధన చేసే దేశములను నాశనము చేసిన సందర్భాలలో జరిగిన కొన్ని భయానక విషయాలు వినుటకు యోగ్యమైనవి కాకపోయినను ఆజ్ఞ వెనుక ఉన్న ఉద్దేశమును వివరించడానికి ఆ వివరణ ఉపయోగపడుతుంది. ఇశ్రాయేలీయుల చుట్టూ ఉన్న విగ్రహారాధన చేసే దేశములకు నిజమైన లేక ఏకైక దేవుని గూర్చి సాక్ష్యమివ్వవలసిన బాధ్యత వారిపై ఉన్నది. నిజమైన దేవుని ఆరాధించడమంటే ఏమిటో అన్యజనులకు వారు చూపించవలసియున్నది. అయితే దానికి విరుద్ధముగా ఇశ్రాయేలీయులే అన్యదేవతలకు పూజించడం మరియు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేయడం సంభవించినది.

ఇశ్రాయేలీయులు "వ్యభిచారము చేసిరి" అనే ఈ పద సముదాయమునకు వారు అన్యదేవతలను అనుసరించి హేయమైన లైంగిక పాపములను చేసి యున్నారు. ఇక్కడ పతనమైపోయిన మానవుని యొక్క స్వభావమును సాతానుడు అనుకూలముగా తీసుకొని విగ్రహారాధన చేసే స్త్రీలను ప్రోత్సహించి వ్యభిచారము ద్వారా పురుషులను భ్రష్టు పట్టించాడు.

శారీరక సంబంధమైన వ్యభిచారము ఆత్మీయ సంబంధమైన వ్యభిచారము చేయుటకు దిగజారిపోయే స్థితికి నడిపిస్తుంది. ఇశ్రాయేలు ప్రజలు విగ్రహారాధన చేసే వారితో సహవాసము చేసి అబద్ధ దేవతలను పూజించుట ద్వారా "బయల్పెయోరు'తో కలిసిపోయి బలులను అర్పించే స్థితికి దిగజారిపోయారు. శరీర కోరికలను తీర్చుకొనుటకు దేవుడు వారికి బోధించిన అన్ని విషయాలను త్రోసిపుచ్చారు.

ఇది ఎలా సంభవించినది? ముందుగా శారీరక పాపము చేయుట వలన అది పరిపక్వమై ఆత్మీయముగా పాపము చేయుటకు వారి వివేకమును మరియు మనస్సాక్షిని ఉద్దేశపూర్వకముగా కఠినపర్చుకున్నారు. సాతాను గురిని ఆవిధముగా చేరుకున్నారు. వారు ఎంతగా దిగజారిపోయారంటే ఒకడు మోయాబు స్త్రీని తన వెంటబెట్టుకొని మోషే ఎదుటను మందిరమునకు వెలుపల వున్న స్థలము యొద్ద ఇశ్రాయేలీయులు నివసించుచుండగ, వాడు నివాసముంటున్న శిబిరములోనికి తీసుకొని వచ్చెను.

**మన మనస్సులు మరియు దేహములు ఆంతరంగికముగా ముడిపడి ఉంటాయి. వీటిలో ఏ ఒక్కటి దేనికైతే ప్రభావిత మవుతుందో, అది రెండవ దానిని కూడా ప్రభావితం చేస్తుంది. పైన ఉదహరించిన ఉదాహరణ ద్వారా ఆధ్యాత్మికముగా దిగజారిపోవడానికి కోరికలు ఎంత ప్రమాదకరముగా పనిచేస్తాయో అనే విషయములో మనము ఏమి నేర్చుకొనగలము?**

మంగళవారం నవంబరు 2

## మీ దేవుడైన యెహోవాను హత్తుకొనుడి

బయల్పెయోరు వెంట వెళ్ళిన ప్రతి మనుష్యుడు నశించెను. బయల్పెయోరు పాపములో వేలాదిమంది మరణించారు. అయితే అనేకమంది ఆ మతభ్రష్టత్వమును అనుసరించలేదు. వారెవరు?

**మీ దేవుడైన యెహోవాను హత్తుకొనిన మీరందరును నేటి వరకు సజీవులై యున్నారు (ద్వితి 4:4). పాపములో పడినవారిని మరియు పాపములో పడనివారి మధ్య ఉన్న తేడాను ఈ వాక్యము ఏవిధముగా వివరిస్తుంది? మన జీవితాలలో దేవుని యొక్క శక్తి, పాపమును గూర్చిన శోధన విషయములో ఈ వాక్యము ద్వారా వచ్చుచున్న ప్రాముఖ్యమైన వర్తమానమేమిటి?**

ఈ వాక్యములోను దానికి ముందున్న వాక్యములోను ఉపయోగించిన “అందరు” అనే మాటలో ఉన్న తేడాను గమనించండి. బయల్పెయోరును వెంబడించిన వారందరు హతమైరి కాని మీలో ప్రతి ఒక్కరు మీ దేవుడైన యెహోవాను హత్తుకొనిన వారు బ్రతికియున్నారు. ఈ రెండింటి మధ్య వేరే చోటు లేదు. అప్పుడు లేదు మరియు ఇప్పుడు మనకు కూడా లేదు. మనము ఇప్పుడు యేసుకు అనుకూలముగాను లేక యేసుకు వ్యతిరేకముగాను ఉంటున్నాము (మత్తయి 12:30).

“హత్తుకొనియుండుట” అనే మాటకు హీబ్రూ భాషలో “డెబెక్యు” అనగా హత్తుకొనుట. ఒక వ్యక్తికి వెలుపల వేరొక బలమైన ఆధీనము అవసరమైయున్నది. ఈ హెబ్రీ పదము యొక్క భావమునే ఆది 2:24లో ఒక పురుషుడు తన కుటుంబమును విడిచి తన భార్యను

హత్తుకొనును అని భార్య భర్తల విషయములో వాడబడినది (రూతు 1:14 కూడా చూడుడి). "హత్తుకొనుట" అనే భావము ద్వితియోపదేశ కాండములో నాలుగు చోట్ల వాడబడినది (ద్వితి 10:20; 11:22; 13:4; 30:20) ఈ మాట వాడబడిన ప్రతిచోట దాని భావము మాత్రము ఒకే విధముగా ఉన్నది. అనగా 'ప్రజలు దేవునిని హత్తుకొని ఉంటారు" ప్రజలు దేవునికి సమర్పించుకోవాలి. అప్పుడు ఆయన యొద్ద నుండి శక్తిని మరియు బలమును పొందుదురు.

ఇక్కడ ప్రజలు హత్తుకొందురు అనే క్రియా పదమునకు సూచనగా వున్నారు. ప్రజలే దేవునిని హత్తుకోవాలి అటు తరువాత ఆయన యొక్క శక్తి మరియు బలముతో వారు పాపములో పడకుండా తప్పించుకోగలుగుతారు.

**యూదా 24 మరియు 1 కొరింథి 10:13 చదువుడి. ఇక్కడ నూతన నిబంధనలో ఏమి చెప్పబడినదో అదే విషయాన్ని ద్వితి 13:4లో కన్పించుచున్నదా?**

దేవుడు నమ్మదగినవాడు. మనము పాపములో పడిపోకుండా కాపాడగలడు. అయితే బయల్పెయోరు యొద్ద కొంతమంది తెలివైన తీర్మానము తీసుకొని పాపములో పడకుండా సజీవులుగా ఉన్న వారివలె మనము కూడా ఎటువంటి శోధననైనను జయించి విశ్వాసిగా నిల్చుటకు విజ్ఞతతో కూడిన తీర్మానము తీసుకోవాలి.

**మనము దేవునిని హత్తుకొని యుండుటకు, ప్రార్ధన, బైబిలు అధ్యయనము, దేవుని ఆరాధించుట మరియు క్రైస్తవ సహవాసము కలిగియుండుట వంటి కార్యములు ఏవిధముగా మనకు సహాయపడును?**

బుధవారం నవంబరు 3

## ఇంత గొప్ప దేశము ఎక్కడున్నది?

ద్వితి 4:4 తరువాత ఉన్న కొన్ని వచనములు బైబిలంతటిలో చాలా గంభీరమైన మరియు దివ్యమైనవిగా పరిగణింపబడెను. ఈ వాక్యములలోనే ద్వితియోపదేశ కాండముయొక్క వర్తమానములో ఉన్న ముఖ్య సారాంశము ఇక్కడే కనిపిస్తుందనే కొంతమంది బైబిలు పండితుల అభిప్రాయమై యున్నది. ఈ వాక్యములను చదువుచుండగ ఏవిధముగా వీటిని మన జీవితానికి అన్వయించుకొనగలమో ఆలోచించండి.

**ద్వితి 4:5-9 చదువుడి. ఇక్కడ ఇశ్రాయేలుకు చేసిన విషయాన్ని గురించి మోషే ద్వారా దేవుడు ఎందుకు చెప్పెను?**

ఇశ్రాయేలు జనాంగమును దేవుడు ఒక ప్రత్యేకమైన కారణముతో వారిని ఎన్నిక చేసుకొని పిలిచియున్నాడనే విషయము వారికి తెలియాలని ఆయన కోరియున్నాడు. "నిన్ను గొప్ప జనముగా చేసెదను" అని కల్దీయుల ఊరను పట్టణములో తన తండ్రి యింట

ఉండగా దేవుడు మొట్టమొదటిసారిగా అబ్రహామును పిలిచెను (ఆది 12:2 మరియు ఆది 18:18 కూడా చదువుడి).

వారిని గొప్ప జనముగా చేసెదను అని యిచ్చిన “దీవెనను బట్టి” (ఆది 12:2) భూమి మీద ఉన్న అన్ని కుటుంబములు ఆశీర్వదింపబడాలని దేవుని యొక్క లక్ష్యమై యున్నది (ఆది 12:3) అయితే చివరికి ఆ వంశావళిలో నుండి లోక రక్షకుడైన యేసు, మెస్సీయా రావలసియున్నది. అప్పటివరకు అబ్రాము సంతానము ఈ లోకమునకు వెలుగుగా ఉండాలని దేవుని యొక్క ప్రణాళికయై యున్నది. భూదిగంతములవరకు నీవు, నేను కలుగజేయు రక్షణకు సాధనమగుటకై అన్యజనులకు వెలుగైయుండునట్లు నిన్ను నియమించియున్నాను” (యెషయా 49:6). ఈ వాక్యము ప్రకారము వారిలో రక్షణను కనుగొందురు అనే అభిప్రాయము సరియైనది కాదు గాని వారి ద్వారా రక్షించగల నిజ దేవుడు బయలుపర్చబడును అని అర్థమునిచ్చుచున్నది.

ఆకాశమును, భూమిని మరియు విశ్వమంతటిని సృజించిన ప్రభువైన దేవునిని ఇశ్రాయేలీయులు ఆరాధించి సేవించుచుండగ, అన్యమతస్తులు రాళ్ళను, బండలను, చెక్కను మరియు దయ్యములను, సాతానును ఆరాధించుచున్నారు (ద్వితి 32:17; కీర్త 106:37). ఎంత తేడా ఉన్నది?

ఇశ్రాయేలు జనాంగము ప్రత్యేక జనముగా పిలువబడుటకు ఈ వాక్యాలలో మోషే రెండు విషయాలను చూపిస్తున్నాడు. మొదటిది: పరిశుద్ధ మందిరము ద్వారా దేవుడు వారికి సమీపముగా ఉన్నాడు. రెండవది : ధర్మశాస్త్రములో ఉన్న నియమాలు మరియు ఆయన యొక్క న్యాయమైన తీర్పులు వారిని ప్రత్యేక జనముగా పరిగణించుటకు దోహదపడినవి.

**ద్వితి 4:32-35 చదువుడి. వారికి ఇవ్వబడిన ప్రత్యేకమైన పిలుపును వారు గుర్తించునట్లు వారికి ప్రభువైన దేవుడు ఇంకా ఏమి చెప్పియున్నాడు?**

ఇశ్రాయేలును ఎంతగానో ఆశీర్వదించియున్నాడనుటలో సందేహము లేదు. అయితే ఇప్పుడు వారు ఏవిధముగా ఆయన పిలుపునకు స్పందిస్తారు?

**గురువారం** **నవంబరు 4**

## మీ జ్ఞానము మరియు మీ వివేకము

ఇశ్రాయేలు దేశమునకు ప్రత్యేక హోదా కలిగియుండటమే కాకుండా దానికి సువార్త సేవ చేయవలసిన బాధ్యత కూడా ఉందనే విషయాన్ని ద్వితి 4:1-9లో చూస్తున్నాము. వారు దేవునికి విధేయత చూపించాలి. ఆయనను వెంబడించాలి. దేవుడు వారిని గైకొనమని ఆజ్ఞాపించిన విషయాలను నెరవేర్చాలనే భావము ఈ వాక్యాలలో అల్లుకుపోయి ఉన్నది.

**ద్వితి 4:6 మరొకసారి చదవండి. ఇతర దేశముల దృష్టిలో వారి విజ్ఞాన వివేకములను గూర్చి ప్రత్యేకించి ప్రభువు చెప్పిన విషయమేమిటి?**

ఈ వాక్యమును చదివిన వెంటనే దేవుని కట్టడలయందు, తీర్పులందు జ్ఞాన వివేకములున్నవనే భావము కలుగవచ్చును. అయితే ఈ వాక్యము ఆ విధముగా చెప్పుటలేదు. ఇశ్రాయేలీయుల యొక్క జ్ఞానము, వివేచన వారికి దేవుని కట్టడలను, ఆజ్ఞలను గైకొనుట ద్వారాను, వాటికి విధేయత చూపుట ద్వారాను కలుగుచున్నదని ఈ వాక్యము వివరించుచున్నది. వారి విధేయతే వారి జ్ఞానము మరియు వివేకమైయున్నది.

ఆశ్చర్యకరమైన ఆజ్ఞల విధానము, కట్టడలు మరియు నియమములు మొదలగునవి లోకము ఎన్నడూ చూడనట్టి రీతిలో ఇశ్రాయేలు ప్రజలు (దేశము) కలిగియుండవచ్చును. అయితే ఇశ్రాయేలు వాటిని అనుసరించకపోయినను లేక వాటిని గైకొని జీవించకపోయినట్లయితే వారికి ఏమి ప్రయోజనము కలుగుతుంది? దానికి బదులుగా నిజముగానే వారు దేవుని యొక్క ధర్మశాస్త్రమును గైకొనుచూ జీవితాలను జీవించుట వలననే వారికి జ్ఞానము మరియు వివేకముగల వారయ్యారు. దేవుడు వారికిచ్చిన సత్యము ప్రకారము జీవించి, విధేయత చూపించాలి. వారి జీవితాల ద్వారా లోకమునకు సాక్షులైయుండాలనునది వారి వివేకము వెనుక ఉన్న లక్ష్యమైయున్నది.

"లోకములో ఉన్న ఇతర దేశముల ముందు ఇశ్రాయేలు ప్రజలు అనుభవించిన సంపదలు, అభ్యుదయమునకు కారణము వారి విధేయతే. విధేయతే వారికి జ్ఞానము మరియు వారు చేసే పనులయందు నైపుణ్యతను అనుగ్రహించెను. సకల వ్యాధుల నుండి, వేదనల నుండి వారు సంరక్షించబడిరి. భూమి మీద వారు ఒక ఘనమైన దేశముగా వర్థిల్లుటకు సర్వ సౌకర్యములతో దేవుడు వారిని నింపెను. విధేయత కలిగి యుండుటే వీటన్నిటిని పొందుటకు కారణమయ్యింది" -ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు, పుట 288.

**మత్తయి 5:13-16 చదువుడి. దేవుడు పురాతన ఇశ్రాయేలుకు ఏమి ఉపదేశించెనో ఈ వాక్యముల ద్వారా యేసు నేడు మనకు కూడా అందించుచున్నాడా? సెవెంతు డే ఎడ్వెంటిస్టు సభ్యులముగా ఇవి మనకు ఏవిధముగా వర్తిస్తాయి?**

## శుక్రవారం నవంబరు 5

## అదనపు అధ్యయనం

"పరలోకములో ఆరంభమైన మహా సంఘర్షణ ద్వారా దేవుని యొక్క ధర్మశాస్త్రమును నిరర్థకము చేసి తిరస్కరించాలని సాతాను యొక్క లక్ష్యమైయున్నది. తన లక్ష్య సాధన నిమిత్తమై సాతానుడు సృష్టికర్తపై తిరుగుబాటు చేయుటవలన భూమి మీదకు నెట్టివేయబడినాడు. ఆ విధముగా పరలోకములో ఆరంభమైన మహా సంఘర్షణ భూమి మీదకు వ్యాపించెను. భూమి మీద మనుష్యులను మోసము చేసి దేవుని యొక్క ధర్మశాస్త్రమును

వారు గైకొనకుండా చేయుటయే సాతాను యొక్క గురియైయున్నది. ధర్మశాస్త్రమునకు పూర్తిగా వ్యతిరేకతను ప్రోత్సహించలేకపోయినప్పుడు ధర్మశాస్త్రము కొంత భాగమును లేక ఒక ఆజ్ఞను మీరేవిధముగా మనుష్యులను పెడత్రోవ పట్టించారు. ధర్మశాస్త్రమంతటిని లేక అందులో ఒక ఆజ్ఞను మీరినా, ధర్మశాస్త్రమంతయు మీరినట్లే కాబట్టి (యాకోబు 2:10) చివరికి ఆజ్ఞ మీరేటట్లు లోకమును సాతానుడు మోసపుచ్చెను. –ఎలెన్ జి వైట్, మహా సంఘర్షణ, పుట 582.

"బయల్పెయోరు విషయములో సాతాను ఉచ్చునందు పడి ఇశ్రాయేలీయులలో కొందరు నిషేధించబడిన ఆరాధనా విధానమును అనుసరించారు. మోసపూరితమైన ప్రవర్తన, విగ్రహారాధనకు సంబంధించిన జీవిత విధానము, దురాశలను రేకిత్తించే విధమైన నృత్యములు, సంగీతము యెహోవా దేవునికి వ్యతిరేకముగా అన్యదేవతకు మ్రొక్కుట వంటి హేయమైన విషయాలతో లోకము మోసపోయినది" –ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 4541.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. పురాతన ఇశ్రాయేలు ఉన్న స్థానములో సెవెంతు డే ఎడ్వంటిస్టు సభ్యులున్నట్లు ఊహించండి. లోకమునకు మరియు ఇతర క్రైస్తవ సంఘములకు విరుద్ధముగా మనకు దేవుడనుగ్రహించిన విషయాలను గూర్చి ఆలోచించండి. మనకు అనుగ్రహించబడిన దానితో మనమేమి చేయుచున్నాము? లోకము యెదుట మన జ్ఞానము మరియు మన వివేకమును ఎంత బాగుగా చూపించగలుగుచున్నాము?
2. ఎవరైతే దేవుని హత్తుకుంటారో వారు సజీవులుగా ఉన్నారు. ఇక్కడ ఎవరు అనగా ప్రజలు. దేవుడు ప్రజలను హత్తుకొనడు. మానవులే దేవునిని హత్తుకోవాలి. అందుకు మానవుడు తన స్వేచ్ఛా చిత్తమును ఉపయోగించుకొని దేవునిని హత్తుకునే విధముగా ఎట్లు స్పందించగలము?
3. ఆదివారము పాఠములోని చివరి భాగములను గూర్చి ఆలోచించండి. దేవుని ఆజ్ఞల నుండి దేనిని తీసివేయుట గాని లేక దేనిని కలుపుట గాని చేయకూడదనే దేవుని ఆజ్ఞ యొక్క భావమేమిటి? మార్పు చేయబడిన సబ్బాతు దినము విషయమై మన వైఖరి ఏమిటి?

❖❖❖